క్లుప్తంగా

గ్రూప్–1లో గిరిజన యువకుడి ప్రతిభ



నవాబుపేట: మండలంలోని కొల్లూర్ పంచాయతీ సత్రోనిపల్లితండాకు చెందిన గిరిజన యువకుడు గ్రూప్–1లో ప్రతిభ కనబరిచి డీఎస్పీ పోస్టుకు అర్హత సాధించాడు. సత్రోనిపల్లి గిరిజన తండాకు చెందిన తారాబాయి, చందర్‌నాయక్‌ల కుమారుడు విస్లవత్ అరుణ్‌కుమార్ గ్రూప్–1లో ఉద్యోగ నియామక పరీక్షలో 135 ర్యాంకు సాధించాడు. 1వ తరగతి నుంచి 10 తరగతి వరకు కొల్లూర్‌లో ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించాడు. ఇంటర్ వనపర్తిలో, హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. తాజాగా గ్రూప్–1లో మంచి ర్యాంకు సాధించాడు. అతడికి వచ్చిన ర్యాంకు ప్రకారం డీఎస్పీ పోస్టుకు ఎంపికైనట్లు వివరించాడు. అతని తల్లి అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తుండగా, తండ్రి వ్యవసాయం చేస్తున్నాడు. మారుమూల గ్రామానికి చెందిన గిరిజన యువకుడికి ఈ అవకాశం రావటంతో తల్లిదండ్రులను మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పలువురు అభినందించారు.

బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్‌తో చేయూత



మహమ్మదాబాద్: అనారోగ్యంతో డబ్బులు ఖర్చు చేసి వైద్యం చేయించుకోలేని ప్రజలకు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా చేయూత లభిస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని కుచ్చెమీది తండాలకు చెందిన తూక్యానాయక్, తుల్జిబాయిలకు రూ.60వేల చెక్కును అందించారు. కార్యక్రమలో బీసీసెల్ అధ్యక్షుడు ముకుందం, భీమయ్య, ఆనంద్ ఉన్నారు.

5 నుంచి గౌస్‌పాషా అతం షర్ఫీ ఉత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం బాదేషా బౌలీలో గల షామహ్మద్ గౌస్‌పాషా ఖాద్రీ అతం షర్ఫీ 4వ ఫాతేహా ఉత్సవాలు ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక ప్రతినిధి డాక్టర్ మహ్మద్ గయాజ్‌పాష ఖాద్రీ తెలిపారు. మంగళవారం బర్గానే బాదేషా దర్గా ఆవరణలో ఫాతేహ ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5న గుస్లే షరీఫ్, ముషాయిరా, 6న మగ్‌రిబ్ నమాజ్ అనంతరం గంధోత్సవం, ఖవ్వాలి, 7న దీపారాధన (చిరాగా), 8న ఖత్మే ఖురాన్ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ధార్మిక, మతపెద్దలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మౌలానా మొహసిన్‌పాష ఖాద్రీ, వారిస్‌పాషా ఖాద్రీ, జహంగీర్‌పాష ఖాద్రీ, సుబుర్ జుబేది, ఇబ్రహీం షర్ఫీ, నసీర్ షర్ఫీ, బాబా షర్ఫీ, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



భూత్పూర్: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం భూత్పూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. మద్యం తాగి పట్టుబడితే జైలుకు సైతం వెళ్తారని ఎస్‌ఐ చంద్రశేఖర్ అన్నారు. ఎస్‌ఐ వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



కోయిల్‌కొండ: మాల ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గసభ్యులు బ్యాగరి శేఖర్ గత నెల 22న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మంగళవారం జాతీయ మాలల ఐక్యవేదిక ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుమార్ల నిరంజన్, జిల్లా అధ్యక్షుడు బండిరమాకాంత్, సలహాదారులు కృష్ణయ్య ఆధ్వర్యంలో బూర్గుపల్లి గ్రామంలోని బ్యాగరి శేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.19వేల ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. భవిష్యత్‌లో కుటుంబానికి అండగా ఉంటామని ఉద్యోగుల సంఘం నాయకులు భరోసా కల్పించారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, ఆంజనేయులు, కృష్ణ, యాదగిరి, రఘునాథ్, రమేష్ పాల్గొన్నారు.



రాయపల్లి గ్రామంలో లబ్ధిదారులకు సన్నబియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి



కోయిలకొండలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తున్న నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



23వ వార్డులో రేషన్ పంపిణీ ప్రారంభిస్తున్న తహసీల్దార్, చైర్‌పర్సన్, వార్డుకౌన్సిలర్లు

సన్నబియ్యం పంపిణీ షురూ

- సన్నబియ్యంతో పేదల ఇంట్లో ఆనందం : జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- పేదల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి : దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి
- సంక్షేమ పథకాలతో పేదల అభివృద్ధి : పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలకు సన్నబియ్యం పథకం మంగళవారం జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో ప్రారంభమైంది. ఆయా నియోజకవర్గాల్లో జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. మండలాల్లో, గ్రామాల్లో అధికారులు, నాయకులు మొదలు పెట్టారు.

– సాక్షి,నెట్‌వర్క్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పథకం పేదల కుటుంబా ల్లో ఎంతో ఆనందం నింపుతోందని జడ్చర్ల ఎమ్మె ల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాజాపూర్ మండలంలోని రాయపల్లిలో సన్నబియ్యం పథకాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా రాయపల్లి శివారులో ఉన్న దుర్గామాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరెడ్డిపల్లి జాతీయ రహదారి నుంచి రాయపల్లి వరకు గుంతలరోడ్డుకు నిధులు కేటాయించి బీటీ రోడ్డు వేయించడంతో పాటు రాయపల్లి నుంచి పోలేపల్లి వరకు ఉన్న మట్టిరోడ్డును బీటీగా వేయిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఊర్కొండపేటలో నిన్న జరిగిన సంఘటన తనను ఎంతోగానో బాధించిందని నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్పీకి చెప్పడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఆర్‌ఐ యాదయ్య, మండల అధ్యక్షులు కృష్ణయ్య, రేషన్ డీలర్ రాములు, నాయకులు శ్రీనివాస్‌నాయక్, లింగం, యాదయ్య, విక్రంరెడ్డి, పాల్గొన్నారు

- జడ్చర్ల మండలంలోని 59 రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభమైంది. 8వ వార్డు హౌజింగ్ బోర్డు కాలనీలోని రేషన్ దుకాణంతో పాటు 23వ వార్డులోని రేషన్ దుకాణంలో తహసీల్దార్ నర్సింగ్‌రావు బియ్యం పంపిణీ ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇతర దుకాణాల్లో వార్డు కౌన్సిలర్లు బియ్యం పంపిణీ చేశారు. గ్రామాల్లో నేరుగా రేషన్ డీలర్లు బియ్యం పంపిణీ చేస్తున్నారు.
- గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. భూత్పూర్ మండలంలోని తాటికొండ, భూత్పూర్ పట్టణంలో రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయలక్ష్మి, ఆర్‌ఐలు వెంకటేష్, బాలసుబ్రమణ్యం, మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.
- మూసాపేట మండలం వేముల, అడ్డాకుల మండల కేంద్రంలోని రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు.
- రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు లబ్ధి చేకూర్చేందుకే సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. కోయిలకొండ మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజాగణేష్, డీలర్లు పాల్గొన్నారు.
- పేదల కడుపునింపడమే ప్రభుత్వ లక్ష్యమని డీసీసీబీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహమ్మదాబాద్ మండల కేంద్రంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు.
- అర్హులందరికి సన్న బియ్యం అందాలని, ప్రభుత్వం అందించే బియ్యం విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. నవాబుపేట మండలంలోని కారూర్, ఇప్పటూర్, నవాబుపేట, కొండాపూర్, రుద్రారం, కాకర్లపహడ్ గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ జిల్లా నాయకుడు దుశ్యంత్‌రెడ్డి, మండల నాయకులు ప్రారంభించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహనీయుల శోభాయాత్ర కరపత్రాల ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ రూరల్: బహుజనులు ఏకమై భారత రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు సిద్ధం కావాలని మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్ అన్నారు. కొంతమంది మనువాదులు రాజ్యాంగాన్ని మార్చాలని విషపూరితమైన సిద్ధాంతాలను ముందుకు పెట్టుకునే ఆలోచనలో ఉన్నారని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా ఈనెల 14న జరగబోయే మహనీయుల శోభాయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శోభాయాత్ర ఉమ్మడి జిల్లా కమిటీ అధ్యక్షుడు పాతూరి రమేష్, నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, డాక్టర్ నాగయ్య, రాయికంటి రాందాస్, వెంకట్రాములు, రాజు, కుర్మయ్య, ఎర్ర నర్సింహులు, సాజిదా సికిందర్, నాగరాజు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



పాలమూరు: ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఆరాధ్యుడు కామ్రేడ్ దిలీప్‌కుమార్ ముఖర్జీ 13వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ రీజినల్ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో మొత్తం 71యూనిట్ల రక్త నిల్వలు సేకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రవికాంత్, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, మక్కడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమాజసేవలో సహకారం అందించాలి



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

రాజాపూర్: సమాజసేవలో తోటివారికి తమ వంతు సహకారం అందించేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం రాజాపూర్ మండలంలోని ఖానాపూర్‌లో ఏఎస్పీ నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో జడ్చర్ల బీఆర్ ఆర్ డిగ్రీ కళాశాల 1995 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏఎస్పీ నరేందర్‌గౌడ్ తన సొంత గ్రామమైన ఖానాపూర్‌లో ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షూలు, నోటుపుస్తకాలు, బ్యాగులు, స్టడీమెటీరియల్ పంపిణీ చేయడం సంతోషించ దగ్గ విషయమన్నారు. 1995 బ్యాచ్ డిగ్రీ బ్యాచ్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కావాల్సిన బెంచీలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్‌ఐ శివానందంగౌడ్, లెక్చరర్స్ రవీందర్ రెడ్డి, జగన్, డాక్టర్ సదాశివయ్య, ఉపాధ్యాయులు నాగేంద్రమ్మ,, శశిధర్‌రెడ్డి, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 96వ సప్తాహ మహోత్సవాలు



దేవరకద్రలో వెలసిన వీరప్పయ్యస్వామి దేవాలయం



దేవరకద్రలో శివాలయం

దేవరకద్ర: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయాలలో బుధవారం నుంచి 96వ సప్తాహ మహోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. వారం రోజులు పాటు దేవాలయాల్లో అఖండ భజనలు, నిత్య సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి దేవస్థాన కమిటీ వారు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధిలో ఉన్న శివాలయానికి వందల సంవత్సరాల చరిత్ర ఉంది. వీరప్పయ్యస్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. దేవాలయం పునర్నిర్మాణంలో భాగంగా మూడు రోజులుగా కలశాల ప్రతిష్ఠాపన, నవగ్రహ, నాగదేవత విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు మంగళవారం ఘనంగా ముగిశాయి.

వారం రోజుల పాటు ఉత్సవాలు..

ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయాలల్లో బుధవారం రాత్రి 9 గంటల నుంచి అఖండ భజనలు ప్రారంభమవుతాయి. 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు వంతుల వారీగా భజన పరులు రాత్రి పగలు అఖండ భజనలు కొనసాగిస్తారు. 7న రాత్రికి స్వామి వారి ప్రభోత్సవం, 8న రాత్రికి రథోత్సవం నిర్వహిస్తారు. 9న స్వామి వారి పల్లకీసేవ, చక్రస్నానం, డోలారోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి. సప్తాహ మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యనిర్వాహణ అధికారి పెరుమాండ్ల కొమ్మాలు తెలిపారు. వారం రోజుల పాటు దేవాలయం వద్ద భజన పరులకు, భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

నేడు దేవరకద్రలో సన్నబియ్యం పంపిణీ

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో బుధవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రారంభిస్తారని తహసీల్దార్ కృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరకద్రలోని 8వ, 9వ నెంబర్ రేషన్ షాపుల్లో ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే సన్న బియ్యం పంపిణీ చేస్తారని తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నవాబుపేట: మండల కేంద్రంలో జోగు పద్మమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మంగళవారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఆంజనేయులు, నిరంజన్, కుమార్, శ్రీకాంత్, లాలు, శ్రీనువాస్ ఉన్నారు.

'కంపుకొడుతున్న డ్రైయినేజీలు'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక భాగ్యనగర్ కాలనీ (డివిజన్ నం.9) లోని రెండు, మూడు కింది గల్లీలలో డ్రైయినేజీలను శుభ్రం చేయడం లేదని కాలనీ సంక్షేమ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి చికిరాల పట్టాభి ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ మోరీలలో చెత్తకుప్పలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నా పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు తొలగించడం లేదన్నారు. దీంతో చుట్టుపక్కల నివసిస్తున్న వారికి దుర్వాసన వస్తోందని వాపోయారు. ఓపెన్ ప్లాట్లలో కంపచెట్లు ఏపుగా పెరిగాయని, వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



అంబేడ్కర్ చౌరస్తా లో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

- సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్

మహబూబ్‌నగర్ న్యూటౌన్/జెడ్పీ సెంటర్ (మహబూబ్‌నగర్)/మిడ్జిల్: ఊరుకొండ పేటలో మహిళపై లైంగికదాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించి మహిళలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఐద్వా జిల్లా నాయకురాలు వి పద్మ మాట్లాడుతూ రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు దాడులు పెరిగిపోతూనే ఉన్నాయన్నారు. మహిళపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వరద గాలి అన్న, పట్టణ నాయకులు లక్ష్మయ్య, సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘం, ఐద్వా, ఆవాజ్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ఉద్యమకారుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

- ఉర్కొండపేట ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర మహిళపై జరిగిన సామూహిక లైంగికదాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని మాజీ సైనికుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంటయ్యగౌడ్ ఒక ప్రకనటలో డిమాండ్ చేశారు. బాధ్యత రహితంగా వ్యవహరించిన ఆలయ ఈఓపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.
- ఊర్కొండపేటలో ఇటీవల మహిళపై లైంగిక దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి టైగర్ జంగయ్య డిమాండ్ చేశారు. మిడ్జిల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దైవ దర్శనం కోసం వచ్చిన మహిళపై మానవత్వం మరిచి ప్రవర్తించడం చాలా బాధాకరమన్నారు. సమావేశంలో సురేష్, భాస్కర్, రవీందర్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ భూముల జోలికొస్తే ఉద్యమమే



భగత్‌సింగ్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికి ప్రభుత్వం వస్తే రాష్ట్ర స్థాయిలో ఉద్యమం చేపడతామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం యూనివర్సిటీ భూములను లాక్కోవడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ భూములను కాపాడేందుకు ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపడితే పోలీసులు అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని, యూనివర్సిటీ భూముల్లో బుల్డోజర్లు పెట్టి మూగజీవాల ప్రాణాలు తీస్తున్నారని, కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీలకు భూములను కట్టబెట్టేందుకు ప్రభుత్వం వేలం వేయడం దారుణమైన విషయమన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో దొరల రాజ్యం నడుస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి భూములను వేలం వేయాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన తెలుపుతున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నందు, ఈశ్వర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంతోనే పనులకు నాంది

- కోడూర్ కస్తూర్బా కళాశాల భవన నిర్మాణం షురూ
- ఫిల్టర్ ఇసుకను సిద్ధం చేసిన కాంట్రాక్టర్
- ప్రభుత్వ భవనాలకు ఇసుక కొరత.. ప్రైవేట్ భవంతుల చెంతకు డంపులు



కేజీబీవీ కళాశాల భవన నిర్మాణం కోసం సిద్ధంగా ఉంచిన ఫిల్టర్ ఇసుక

మహబూబ్‌నగర్ రూరల్: విద్య వ్యాప్తి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ నిధులు పెద్దఎత్తున వెచ్చిస్తున్నాయి. విద్య వ్యవస్థ బాగుపడినప్పుడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. అయితే విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనం నిర్మించేందుకు ప్రభుత్వం మొదలుపెట్టింది. మండలంలోని కోడూర్ గ్రామ శివారులో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తూ జూనియర్ కళాశాలగా మార్చారు. పాఠశాల స్థాయి పెరగడంతో అక్కడ సౌకర్యాలు, వసతులు అనివార్యమైంది. రూ.3.25 కోట్లతో కస్తూర్బాగాంధీ బాలికల కళాశాల అప్‌గ్రేడ్ పనులకు స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. రేపో, మాపో భవన నిర్మాణ పనులు మొదలవుతాయని గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు. సీఎం సొంత జిల్లా అని భయం లేకుండా సంబంధిత కాంట్రాక్టర్ కేజీబీవీ జూనియర్ కళాశాల భవన నిర్మాణం పనుల ప్రారంభానికి నాసిరకంతోనే మొదలుపెట్టాలనే ఆలోచనలో ఉన్నారు. అందుకు కోడూర్ గ్రామ సమీపంలో ఉండే ఫిల్టర్ ఇసుకను సిద్ధం చేశారు. ఈ విషయం తెలియక అధికారులు తమ పని తాము చేసుకుపోతున్నారు. కోట్లాది రూపాయల విలువైన కళాశాల భవన పనుల్లో ఆది నుండే నాసిరకం జరిగితే ముందు ముందు ఎలాంటి పరిస్థితి ఉంటుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవినీతి అంటేనే గిట్టని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇలాఖలో ఇలా నాసిరకంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ సిద్ధం కాగా, ఎమ్మెల్యేకు ఈ విషయం తెలియడం లేదా? అని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భవనాలు నిర్మించాలంటే కొంతమంది అధికారులు ఇసుక కొరత అంటున్నారు, అదే ప్రైవేట్ వ్యక్తులు భవనాలు నిర్మిస్తే సులభంగా ఇసుక దొరుకుతోంది.

ఫిల్టర్ ఇసుకను వాడొద్దన్నాం..



కేజీబీవీ కళాశాల నూతన భవన నిర్మాణంలో వాగు నుంచి తెచ్చిన ఇసుకనే వాడాలని కాంట్రాక్టర్‌కు చెప్పాం. ప్రస్తుతం ఫిల్టర్ ఇసుక డంప్ చేసింది వాస్తవమే. ఆ ఇసుకను వాడొద్దని చెప్పాం. భవన నిర్మాణం కోసం ఇసుకను వాగు నుంచి తెప్పించేందుకు కలెక్టర్‌కు లేఖ రాశాం. కళాశాల భవన నిర్మాణ నాణ్యత విషయంలో నిక్కచ్చిగా ఉంటాం. నిర్మాణ పనులు సకాలంలో పూర్తయ్యేలా చూస్తాం.

– మహ్మద్ అబ్దుల్ హుస్సేన్, ఏఈ, ఈడబ్ల్యూఐడీసీ

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి



ఉంద్యాలలో జై భీమ్ జ్ఞానదీక్ష చేపట్టిన విద్యార్థులు

చిన్నచింతకుంట: రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అంబేడ్కర్ జాతర కమిటీ జిల్లా అధ్యక్షులు అమరచింత విజయ్ అన్నారు. మంగళవారం చిన్నచింతకుంట మండలం ఉంద్యాలలో విద్యార్థులు జై భీమ్ జ్ఞాన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై గ్రామ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. రాజ్యాంగంతో పాటు మహనీయులు డాక్టర బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం, మహాత్మా జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే, పెరియార్, నారాయణగురు, సాహు మహరాజు, కాన్సీరాంల వంటి చరిత్రలు తెలిసి ఉండాలన్నారు. అందుకు విద్యార్థులు ఈనెల 1వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 14 రోజుల పాటు కాళ్లకు చెప్పులు, మాంసం, మద్యం వంటివి వీడీ దీక్షను చేపట్టి రాజ్యాంగంతో పాటు మహనీయుల జీవిత చరిత్రలను పఠిస్తారన్నారు. కార్యక్రమంలో జాతర కమిటీ నాయకులు కిన్నెర, మహేందర్, ఉంధ్యాల రెమో, కోట్ల శేఖర్, వి.ప్రవీణ్, ఎం.కృష్ణయ్య, భాను ప్రకాష్ ఉన్నారు.